వార్తలు, మూడు గంటలకి ఆంగ్లంలో వార్తలు, సాయంకాలం ఐదున్నరకి తెలుగు చలనచిత్రం "చేటలో బియ్యం-బాటలో రాళ్లు." ఏడున్నరకి తెలుగులో వార్తలు. ఏడు గంటల నలభై అయిదు నిమిషాలకి ఉరుదూలో వార్తలు. ఏడూయాభైకి తెలుగు చలనచిత్రం తరువాయి **భారం**. ఎనిమిది గంటల నలభై నిముషాల నుండి జాతీయ కార్యక్రమాలు."

"మధ్యాహ్నం రెండు గంటల వేళప్పుడు టెలిప్రింటర్‌మీద వివరంగా మర్నాడు ఫలానా వేళకి ఫలానా కార్యక్రమాలంటూ అన్ని వివరాలతో ఛార్ట్ వస్తుంది. చూసి చెప్పొచ్చు" అని నేను కనకయ్యకి చెప్పలేదు. ఆ పెంట పని అంతా ఎవడు చేస్తాడని ఎవరితోనో తగూ పెట్టుకుంటే వాడికి ఈ ఉద్యోగం కూడా పోతుంది. ★

# 79. వర్గవిభేద పరిష్కారం

**ఆ**మధ్య ఏదో పనిమీద రాజమండ్రి వెళితేనూ; నా మిత్రుడు చిరంజీవిరావు, తన మిత్రులు కొందరు ఆ వేళకి అక్కడ కూచుని వుంటే వాళ్లకి నన్ను పరిచయం చేసే కార్యక్రమం చేపట్టాడు.

"ఇతను మా క్లాస్మేటు. మీరతని పేరు వినే వుంటారు; "రైటరు" అన్నాడు ఒకాయనతో.

"టూటౌనాండీ?" అన్నాడాయన.

నేనేమీ జవాబు చెప్పలేని పరిస్థితి!

"అదేనండీ. వన్ టౌన్ పోలీసు స్టేషన్ రైటరు సుబ్బారావు మా తోడల్లుడండి. అంచేత తమరు టూ టౌన్ రైటరేమో అనుకున్నానండి." అన్నాడతనే; రెండు క్షణాలు ఊరుకొని.

మా చిరంజీవిరావు "రైటర్" అనే పదానికున్న ఇతర అర్థాలు చెప్పి అతన్ని శాంతపరచి; ఇంకో ఆయనతో "మీకులాగే ఇతనికి స్టాంపు కలెక్షను హాబీ అండీ". అని చెప్పేడు.

ఆయన నొసలు ముడిచి "స్టాంపు కలెక్షనేమిటండీ బాబూ, ఫిలేటెలీ అన్లేరు?" అన్నాడు.

మా చిరంజీవి రావు పల్లెటూరి బైతు తనాన్ని క్షమించి ఆ "ఈవినింగు సెవెన్ తర్టీకి" మనం అంతా వో దగ్గిర "కూర్చోవాలి" అని నిర్ణయం తీసుకున్నారు అతని మిత్రులు. "నరసప్పగారు లేకపోతే మజా వుండదు. అతన్నెలాగయినా లాక్కురావాలి." అన్నాడు చిరంజీవి.

"ఐ విల్ టేక్ కేర్ ఆఫ్ హిం" (అతని సంగతి నేను చూసుకుంటానులెండి) అని వన్ టౌన్ "రచయిత" గారి షడ్డకుడు హామీ ఇచ్చేడు.

నరసప్పగారు మా "గేదరింగు" లో కొంచెం "లేటు" గా "జాయినయ్యేడు." అంచేత రావడం రావడమే "ఎపాలజీస్" తో మొదలెట్టేడు.

ఆరోజు ఈస్టుకోస్టు ఎక్స్‌ప్రెస్‌లో నరసప్పగారి డిపార్టుమెంటులో అతన్ని తవ్వి పాతెయ్యగల పవర్సున్న ఆఫీసర్ హైదరాబాదు నుండి కాకినాడ వెడుతున్నారనీ, వార్ని రాజమండ్రి స్టేషన్‌లో "ఎటెండ్" అవమనీ మెసేజి వచ్చిందిట.

"ఈస్టుకోస్టు సాయంకాలం 4-45 కే వెళిపోవాలి కదా?"

"మామూలుగా అయితే అంతే. ఇవాళ రెండువందల నిముషాలు లేటు."

అందరూ నవ్వేరు.

"ఆగండి. ఎందుకు నవ్వుతారు? నవ్వవలిసింది ఇప్పుడు కాదు. ఇంకా ముందుంది అసలు

సంగతి. అప్పుడు నవ్వాలి.'' అన్నాడు నరసప్పగారు.

"వెనకోసారి శ్రీపాద పినాకపాణి గారి గాత్ర సంగీత కచేరీలో ఇలాగే జరిగింది. ముందు వరసలో కూర్చున్న ఒక రసిక శిఖామణి ఊరికే తొడ బాదేసుకుంటూ ఎంత గట్టిగా బాదుకున్నా ఎవరూ గుర్తించడం లేదన్న కసితో ఉండుండి "ఆహా'' అని కేకవేశాడు. అప్పుడు పినాకపాణి గారు పాట ఆపి "ఇప్పుడు కాదు ఆహా అనవలసింది!'' అని అతనికి చెప్పి మళ్లీ పాటలో పడి ఒక క్లిష్టమైన స్వరప్రస్తారం చేస్తూ "ఇప్పుడూ, "ఆహా'' అనవలసింది!'' అన్నట్టుగా ఆ కళాపిపాసికి సంజ్ఞ చేసేరుట.

నరసప్పగారు మమ్మల్ని నవ్వ వద్దన్నాడు కదా అని అందరం ఏడుపు మొహాలు పెట్టేం.

"రైలుకొచ్చి ఎటెండవమని మెసేజివస్తే దానికి ఒక్కటే అర్థం. ఉదయం పూట అయితే ఇడ్లీలూ, పెసరట్టూ, కాఫీ పట్టుకెళ్లాలి. మధ్యాన్నం దాటేక అయితే స్వీటూ, హాటూ, టీ, పట్టుకెళ్లాలి. రాత్రయితే-''.

"అర్థమైందండీ.''

"కాని ఇవ్వాళ సాయంకాలం 4-45కి రావల్సిన బండి 8 గంటలకొచ్చింది. అది సాయంకాలం కాక, రాత్రీ కాని టైం ఏం పట్టుకెళ్లాలో తెలీక, ఓ సంచీలో స్వీటూ వగైరా; మరో సంచీలో సాఫ్ట్ డ్రింక్సూ పట్టుకెళ్లాను. తీరా ఆయన కలిశాక "నాకేమీ వద్దు గానీ, ఈ పక్కనే ఎస్-7 అనే కంపార్టుమెంట్‌లో 33వ బెర్తులో మీ మేడమ్ గారు ఉన్నారు. ఆవిడకివ్వండి. వేగిరం వెళ్లండి.'' అన్నారట ఆయన.

"ఆయనగారు డిపార్ట్‌మెంటు డ్యూటీమీద ఫస్టుక్లాసులోనూ, ఆవిడ స్వంతపన్లమీద సెకండ్ క్లాసులోనూ వెళ్తున్నందువల్ల ; ఇదంతా - ఆ రైలు ఆగిన ప్రతిఊరివారికీ తెలిసి అదో నవ్వులాట విషయం అయింది!'' అని చెప్పి "ఇప్పుడు నవ్వండి!'' అన్నాడు నరసప్పగారు.

ఆ మూడోనాడు నేను విశాఖపట్నంలో ఉండగా మా ఇంటికి ఒక జీపువచ్చి ఆగింది. "గోపాళంగారు తమరే కదండి? మా కమీషనర్‌గారూ మేడమ్ గారూ సర్క్యూట్ హౌసులో ఉన్నారండి. తమర్నోసారి దైచేమన్నారండి.'' అన్నాడు ఆ జీప్ తెచ్చిన డ్రైవర్.

మొన్న రాజమండ్రిలో నరసప్పగారు చెప్పిన ఉదంతంలో కమీషనర్ గారూ మేడమ్ గారూ ఎవరోకాదు; మా దొడ్డమ్మగారమ్మాయి సూర్యకాంతం, మా బావగారైన సూర్యనారాయణ గారూను - అని తెలిసి గొప్ప కులాసా వేసింది.

అయినా సరే, మా అక్కని అడిగాను. "బావగారికి అంత పెద్ద వుద్యోగం కదా, నీకు సెకండ్ క్లాస్ టిక్కెట్టెందుకు కొనాలి? ఫస్టు క్లాసే కొనొచ్చు కదా! పోనీ స్వంత డబ్బు దండుగ అనుకుంటే ఆయనకూడా సెకండ్ క్లాసులో నీతో వచ్చి గవర్నమెంటుకి ఖర్చు ఆదా చెయ్యొచ్చు కదా?''

"ఒరే తమ్ముడూ, నేనొకటి చెప్తాను విను. రైల్లో ఆయన నన్ను సెకండ్ క్లాసులోనే కూర్చోబెట్టినా, రైలు దిగగానే కారులో వెనకసీటూ, గెస్టుహౌసులో ఏసీ రూమూ: అన్నీ ఆయనతో బాటేకదా. ఇంక ఇంటికెళ్లాక అంటావా, సంగతి ఇదీ, సందర్భం ఇదీ - అని నాకు విడమర్చి చెప్పి నిర్ణయాలు తీసుకునే ఫస్టుక్లాసు అధికారం నాకే ఇస్తార్రా, మీ బావగారూ!''

దాంతో నా సందేహాలన్నీ తీరిపోయాయి. ★